క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అయినవిల్లి: ఎస్.మూలపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్.మూలపాలెం, కొండుకుదురు, శానపల్లిలంక, తొత్తరమూడి తదితర గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతుల నిమిత్తం కొత్తపేట, వాడపాలెం, అవిడి, పలివెల, గంటి, ఖండ్రిగ, మందపల్లి గ్రాయాలకు సరఫరా ఉండదు.

సాయం చేసి.. భరోసాగా నిలిచి



సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ. 22 వేల సాయం అందించి భరోసాగా నిలిచారు. అమలాపురం పట్టణానికి చెందిన గుత్తుల ఆనంద బాబు గుండె వ్యాధితో బాధపడుతున్నారు. అతనికి మూడు నెలల్లో గుండె మార్పిడి ఆపరేషన్ ఉచితంగా చేస్తామని తిరుపతి టీటీడీ ట్రస్ట్ వారు చెప్పారు. ప్రస్తుతం మందులకు ఇబ్బంది రాకుండా కాశీఅన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో సాయాన్ని బాధితుడి భార్య పుష్పలలితకు అందించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సఖినేటిపల్లిలంకలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన దాతలు, ఉపాధ్యాయులు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్త చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం, గ్రామస్తుల సహకారంతో ఉచితంగా సైకిళ్ల పంపిణీ జరిగింది. వీరు సంయుక్తంగా సమకూర్చిన 36 సైకిళ్లను విద్యార్థులకు ప్రముఖులు, దాతలు అందజేశారు. సర్పంచ్ రేపూరి రాజేశ్వరి, రేపూరి ఏసు నరసింహరాజా, విద్యా కమిటీ చైర్మన్ జి.సునీత తదితరులు పాల్గొన్నారు.

కాగితపు సంచుల వినియోగంపై సదస్సు



కాగిత సంచుల ఉపయోగాలు వివరిస్తున్న విశ్రాంత ఎంఈఓ జొన్నలగడ్డ

రాజోలు: కాగితపు సంచుల వినియోగంతో కలిగే లాభాలను వివరిస్తూ శుక్రవారం జొన్నలగడ్డ వెంకట సుబ్బారావు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ తాడి ప్రసాదరావు పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వినియోగంతో పర్యావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతింటుందన్నారు. అనంతరం పలు రకాల పేపర్ బ్యాగ్‌లను ప్రదర్శించారు. చిల్డ్రన్స్ పాఠశాల కరస్పాండెంట్ తాటికాయల అయ్యప్ప నాయుడు, విశ్రాంత ఎంఈఓ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ చైర్మన్ మృతి



ఆదినారాయణ (ఫైల్)

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పుల్లేటికుర్రు సొసైటీ మాజీ చైర్మన్ నందుల ఆదినారాయణ (63) శుక్రవారం మృతి చెందారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ తన స్వగృహం వద్ద తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

పాఠశాలలో స్వచ్ఛభారత్

యానాం: పట్టణ పరిధిలో మెట్టకూరు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ స్కూల్‌లో శుక్రవారం సీసీఎస్‌యూనిట్ వలంటీర్లతో మనబడి కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పైభాగంలో పేరుకుపోయిన చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వాటర్‌ట్యాంకును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, హెచ్‌ఎం రాజారామ్మోహన్‌రావు, పీఈటీ శేరు విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సాయమెక్కడ బాబూ..

- ఇంకా అందని 'అన్నదాత సుఖీభవ' సాయం
- పైసా విదల్చని రాష్ట్ర ప్రభుత్వం
- పెట్టుబడులకు రైతన్నల ఎదురుచూపు



ఇసుకపూడిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

అంబాజీపేట: సాగులో సిరులు కురిపించేందుకు రైతన్నలు పొలాల బాట పట్టారు.. చెమటోడ్చి ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు.. అయితే వారికి సరైన తోడ్పాటు లేక నిట్టూర్పు వదులుతున్నారు. గత టీడీపీ హయాంలోని రోజులే మళ్లీ వచ్చాయా అని ఆందోళన చెందుతున్నారు.. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ పథకం సాయం అందకపోవడంతో వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఎలా గట్టెక్కుతుందోనని ఆలోచనలో పడ్డారు. కొన్ని రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగుకు ఉపక్రమించారు. రెండో దుక్కులు చేసి వరి పంట వేస్తున్నారు. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో వరి నాట్లు వేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నియోజకవర్గాలోని 11 మండలాలకు సంబంధించి సుమారు 83 వేల మంది రైతులు, కౌలు రైతులు ఉన్నారు. వీరికి పెట్టుబడి సాయం సకాలంలో అందక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పి.గన్నవరం నియోజకవర్గంలో 25,382, కొత్తపేటలో 34,702, రాజోలులో 8,650 ఎకరాల్లో అన్నదాతలు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ నియోజకవర్గంలో 25 శాతం వరి నాట్లు వేశారు. పెట్టుబడి సాయం ఎప్పుడు అందుతుందా అని, అసలు వస్తాదా రాదా అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా గత వైఎస్సార్ ప్రభుత్వంలో కౌలు రైతులతో పాటు దేవదాయ భూములు సాగు చేస్తున్న వారికీ వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందోనని అంతా మదన పడుతున్నారు

అప్పట్లో ముందే సాయం

గత ఐదేళ్లు రైతులకు స్వర్ణయుగమని చెప్పాలి. పుడమి పుత్రులు సాగు బాట పట్టే ముందే అవసరమైన పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందిస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం అందించే రూ.6 వేలకు తోడు, రైతు భరోసా కింద రూ.7,500 జోడించి మొత్తం రూ.13,500 వారి వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేసి అన్నదాతలను ఆదుకుంది. సాగు ప్రారంభంలోనే ఏటా మే నెలలో తొలి విడతగా రూ.3,500 రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లోకి జమ చేసేది. ఈ ఏడాది నుంచి కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను అందిస్తామని ప్రకటించింది. ఆ సాయం కోసం రైతులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ పథకంలో రైతుల ఖాతాల్లోకి కేంద్ర ప్రభుత్వం తొలి విడతగా గత నెలలో రూ.2 వేల చొప్పున జమ చేసింది. ఈ సాయానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన నగదును జోడించి జమ చేయాల్సి ఉంది. ఇప్పటికీ ప్రభుత్వం పైసా విదల్చలేదు. కేంద్ర ప్రభుత్వ రూ.2 వేల సాయంతో రైతులు ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేశారు. అన్నదాత సుఖీభవ పథకం పెట్టుబడి సాయం ఎప్పుడు జమ అవుతుందోనని వారంతా ఎదురు చూస్తున్నారు.

ఇంకా మార్గదర్శకాలు రాలేదు



"అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. అవి రాగానే రైతులకు వివరిస్తాం. ఇప్పటికే పీఎం కిసాన్ సమ్మాన్‌లో రూ. 2 వేలు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఖరీఫ్ పంటకు సంబంధించి 25 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి."

– ఎస్‌జేఈవీ రామమోహనరావు, ఏడీఏ, పి.గన్నవరం

డెంగీ నివారణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ



పాదలాడలో డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న భారతలక్ష్మి



సంధిపూడిలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజోలు: డెంగీ వ్యాధి నివారణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని అడిషనల్ డీఎంహెచ్ఓ భారత లక్ష్మి అన్నారు. శుక్రవారం పాదలాడలోని కంచి కామాక్షమ్మ కాలనీలో ఆమె పర్యటించారు. ఇక్కడ ముంపునీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల రాకుండా ముందస్తుగానే చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి మానస సుప్రియ, సబ్ యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్, పీహెచ్ఎన్ సత్యవతి, హెచ్‌వీ జయకుమారి పాల్గొన్నారు.

అలమూరు: సంపూర్ణ పారిశుధ్యంతో మెరుగైన ఆరోగ్యాన్ని సాధించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. దీనివల్ల దోమలు దరిచేరవని, తద్వారా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమాలను సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పర్యవేక్షించారు.

అంబాజీపేట: వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జి.వి.గీతాంజలి అన్నారు. పుల్లేటికుర్రులో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ షనా, ఏఎస్ఎం, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



భవ్యశ్రీ



రావి హాసిని

అంబాజీపేట: తొండవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి వాకపల్లి భవ్యశ్రీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో భవ్యశ్రీ (567) మార్కులు సాధించిందన్నారు. ఆమెను హెచ్ఎం పీవీ కేశవాచార్యులు, స్టాఫ్ సెక్రటరీ మట్టపర్తి రాంబాబు, జి.శ్రీనివాస్, కేసీహెచ్ఎల్‌జీ నరసింహారావు, మానుకొండ చంద్రరావు అభినందించారు.

కొత్తపేట: మండలం నుంచి 9 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తెలిపారు. చప్పిడివారిపాలెం పాఠశాల నుంచి ముగ్గురు ఎంపికైన విషయం తెలిసిందే. అలాగే బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోలా మోహన్ సత్యశ్రీసాయి సుభాష్, చిట్టూరి తారక్ నాగవెంకట సాయిమణికంఠ, గుబ్బల శ్రీరూప ఎంపికయ్యారు. కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి కొప్పిశెట్టి యజ్ఞిత, వానపల్లి జెడ్పీ హైస్కూల్ నుంచి బల్ల తేజ, మోడేకుర్రు జెడ్పీ హైస్కూల్ నుంచి కడలి శ్రావ్య లక్ష్మీప్రియ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈఓ వివరించారు. విద్యార్థులను ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, నాయకులు అభినందించారు.

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రావి హాసిని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం సోమ సూర్యకుమారి తెలిపారు. ఆమెను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతురాజు నాగేంద్ర కుమార్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నిత్య భగవన్నామ స్మరణులు అర్చకులు



సత్కారం అందుకుంటున్న అర్చకులు

మండపేట: లోక కల్యాణం కోసం నిత్యం భగవన్నామ స్మరణ చేసేది అర్చకుడు ఒక్కరేనని మరిచి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మరిచి మహాఋషి తిరు నక్షత్రం సందర్భంగా పట్టణంలోని రథం గుడి ప్రాంగణంలో జనార్దన స్వామివారి ఆలయ అర్చకుడు ఖండవల్లి గోపాలకృష్ణమాచార్యులు, భార్గవాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీవైఖానస మరిచి డివిజన్ సంఘ కార్యదర్శి పెదపూడి సీతారామం మాట్లాడుతూ ఆలయాల్లో సాంప్రదాయబద్ధంగా అర్చనలు, కైంకర్యాలు నిర్వహించి ఆలయ వైభవాలను మరింత పటిష్టపరచాలని కోరారు. భగవాతారాధన గురించి సంఘ కోశాధికారి పెద్దింటి మురళి వివరించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి చక్రవర్తుల గోపి, ఆగమ సలహాదారులు పెదపూడి లక్ష్మీజనార్దన మూర్తి, సుదర్శనం దొరబాబు కూడా ప్రసంగించారు. సంఘం తరఫున పలువురు అర్చకులను సత్కరించారు. ఎనిమిది మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సుమారు 500 మంది వైఖానస అర్చకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో హాజరు పెరగాలి



గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న నాగేశ్వరరావు

కాజులూరు: మధ్యాహ్న భోజనంలో విద్యార్థుల హాజరు పెంచేందుకు ఇంప్లిమెంట్ ఏజెన్సీలు శ్రద్ధ చూపాలని కాకినాడ విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాలకు 400 మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 179 మంది మాత్రమే భోజనం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు పెంచేలా నిర్వాహకులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదులు, ఆర్వో ప్లాంటు, న్యూట్రీ గార్డెన్, శానిటేషన్‌ను పరిశీలించి సంతృప్తిం వ్యక్తం చేశారు.

పార్టీలకు అతీతంగానే పాలన



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగానే పాలన ఉంటుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మొదలైన అభివృద్ధి పనుల ప్రోగ్రెస్ అడిగి వాటిని కొనసాగించాలని సూచించారు. అంజెడా లేకుండా మండల పరిషత్ సమావేశం నిర్వహించడం ఏంటని ఆయన అధికారులను ప్రశ్నించారు. తాగునీటి సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరగా, వెంటనే దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా సముద్ర తీర ప్రాంతాల్లో అక్రమ రొయ్యల చెరువులకు ఇచ్చిన అనధికార విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లపై చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మలికిపురంలో సులభ్ కాంప్లెక్స్, శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలానికి రూ.2.70 కోట్ల ఆర్థిక సంఘం నిధులు వస్తే మూడు గ్రామాలకే రూ. కోటికి పైగా కేటాయించి, మరికొన్ని గ్రామాలకు రూ.లక్ష కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, వైస్ ఎంపీపీ కందికట్ల నిర్మలాకుమారి, ఎంపీడీఓ బి.మంగాదేవి పాల్గొన్నారు.

వైభవంగా వారాహి పూజా మహోత్సవం



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు



దాత దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

మామిడికుదురు: నగరం మొల్లేటివారి మెరకలోని విజయ దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం వారాహి అమ్మవారి నవరాత్ర పూజా మహోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా కనకదుర్గమ్మను పలు రకాల కూరగాయలతో అలంకరించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. కుంకుమార్చనలు, చండీ హోమం తదితర పూజలను ఏవీఎస్ సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో శేషుకుమార్‌శర్మ, సాయిశర్మ జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో నిత్యాన్నదాన ట్రస్టుకు ముమ్మిడివరానికి చెందిన నలమల కొండలరావు, వీరలక్ష్మి దంపతులు శుక్రవారం రూ.10 వేలు విరాళంగా సమర్పించారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు ఇచ్చారు. దాత దంపతులకు ఆలయ అర్చకులు స్వామివారి వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఇచ్చారు.

ఇంచుమించు ఇంతే..



వర్షాలకు అధ్వానంగా మారిన బి.దొడ్డవరం ఆర్అండ్‌బీ రోడ్డు

- అధ్వానంగా రహదారులు
- ప్రజలకు తప్పని అవస్థలు

మామిడికుదురు: ఏ దారి చూసినా ఇంచుమించు ఇంతే.. అధ్వాన దారులు అవస్థల పాల్జేస్తున్నాయి. ప్రజల దయనీయ అవస్థలు తెలియజేస్తున్నాయి.. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మామిడికుదురు మండలంలోని ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాటిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారితో పాటు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లోని 216వ నంబర్ జాతీయ రహదారిపై భారీగా వర్షం నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాశర్లపూడి కైకాలపేటలో జాతీయ రహదారి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇక్కడ పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. చాలా రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా దీనిని జాతీయ రహదారుల విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. తాత్కాలిక మరమ్మతులు చేయడం తప్ప పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాశర్లపూడి నుంచి పెదపట్నంలంక వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి వర్ణనాతీతం. మామిడికుదురు కొర్లగుంట రోడ్డుపై ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. మగటపల్లి, ఆదుర్రు, ఈదరాడ తదితర గ్రామాల్లోని రహదారుల పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా ఉంది. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు అవమానం చేసే వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించి, దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని దళిత నేత లంక చందు డిమాండ్ చేశారు. రాయవరంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వెల్ల గ్రామ దళితపేటలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఈ నెల 4న కొందరు ధ్వంసం చేశారన్నారు. ఈ విషయంలో పోలీసులు సకాలంలో స్పందించిన తీరును చందు అభినందించారు. ఇలాంటి దాడులు జరగకుండా పోలీసులు, ప్రజాప్రతినిధులు సకాలంలో స్పందించాలన్నారు.

న్యాయవాదులకు వైద్య పరీక్షలు



రాజోలు బార్ అసోసియేషన్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తులు

రాజోలు: స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు తదితరులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పని ఒత్తిడిలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో తీవ్రమైన అనర్థాలకు గురవుతున్నారని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. అమలాపురం మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి సత్కారం



అంతర్వేదిపాలెంలో శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలో శ్రీసూర్య ట్రేడింగ్ కంపెనీ రైస్‌మిల్లు మేనేజర్, కోనసీమ జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఏపీఆర్ లంకకు చెందిన దివ్వి శ్రీనివాసరావును ఎంపీపీ వీరా మల్లిబాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు గొల్లమందల చిట్టిబాబు, ఇందుకూరి సుబ్బరాజు, మాజీ సర్పంచులు నల్లి సురేంద్రరావు, ఈద రవిరెడ్డి, స్థానికుడు పండు పాల్గొన్నారు.

యువకుడి గల్లంతు



మురళీకృష్ణ (ఫైల్)

మోతుగూడెం (అల్లూరి జిల్లా): మోతుగూడెం పంచాయతీ పరిధిలోని ఉన్న ఫోర్‌బై కెనాల్‌లో పడి అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన మురళీకృష్ణ (24) శుక్రవారం గల్లంతయ్యాడు. ఐదుగురు స్నేహితులతో కలసి ఇక్కడకు విహార యాత్రకు వచ్చాడు. సాయంత్రం పవర్ కెనాల్ పుష్ప షూట్ బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి కెనాల్‌లో పడిపోయాడని తోటి స్నేహితులు తెలిపారు. యువకుడు గల్లంతైన విషయం తెలపడంతో ఎస్ఐ గోపాలరావు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేసిన దాతను సత్కరించిన ఆలయ అధికారులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శుక్రవారం భక్తురాలు భారీ విరాళం అందజేశారు. కాకినాడకు చెందిన వల్లూరి సుమిత్ర రూ.లక్ష నగదును ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. అనంతరం దాతకు అర్చకులు దత్తుశర్మ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో శేషవస్త్రం, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

సీఎల్ఆర్‌లకు ఎంటీఎస్‌గా పదోన్నతి

యానాం: నియోజకవర్గపరిధిలో వివిధ శాఖల్లో ఫుల్‌టైమ్ క్యాజువల్ లేబరర్స్‌గా విధులు నిర్వహిస్తున్న వారికి రెగ్యులర్ పద్ధతిన 29 మందికి మల్టీ టాస్కింగ్ స్టాఫ్(సెక్యూరిటీ)గా నియమించారు. ఈ మేరకు శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ కార్యదర్శి వి.జయశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. కె.ఆదినారాయణ, దామదరరావు, వి.కామరాజు, కె.సత్యనారాయణ, ఎ.శివకుమార్, ఎ.పెదవెంకన్న, దడాల దుర్గాబాలాజీ, ఉండ్రు ప్రభుదాస్, మద్దింశెట్టి యేసుబాబు, పెమ్మాడి శ్రీనివాస్, ఎస్.వీరబాబు, డి.తాతారావు, కాకి రాంబాబు, కె.సాయిబాబు, మల్లాడి సత్తిబాబు, రేఖాడి త్రినాథరావు, కె.శ్యామ్‌కుమార్, కె.అప్పారావు, కుక్కల బాల వెంకటరమణ, నూని వీరబాబు, వి.సత్యనారాయణ, మల్లాడి జయనారాయణ, కాయరాజు, ఇంగి ధర్మారావు, అంగాడి సీతారామరాజు, షేక్ అల్తాఫ్ వీరందరిని పుదుచ్చేరిలో నియమించారు. ముగ్గురు మహిళలను యానాంలో వివిధ శాఖల్లో నియమించారు.

అమ్మవారికి సారె సమర్పణ

అమలాపురం రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా బండారులంక గ్రామంలో బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి, మదన గోపాల, రాజగోపాల మహాలక్ష్మి అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం మహిళలు ప్రత్యేక పూజలు చేసి చీర, సారె సమర్పించారు.